కథానిక

# దెయ్యమూ-దేవుడూ

"మంజుశ్రీ"

"ఏమన్నా బుద్దుండొద్దూ, నేనసలు మంచివాణ్ణి గాను. నోటికొచ్చేవన్నీ కారుకూతలే. ఏం బుద్ధులూ, నేను మంచోణ్ణి గానట. ఆ ఎదవగాడిదె మంచోడట, రాత్రికి సఫాచేస్తానుండు. మిరపతోటకాడ పండుతాడుగా. చూసుకో వీడి జిమ్మడ! పొద్దుపొడిచే ఏలకి పేగులు బయట పడేత్తా. బుడేసాయిబుదగ్గిర మూడుబుడ్లు కొట్టిపోతినా, రేపటికి రెండంటూరు మున్సబు సచ్చి. బుడే ఏవంటాడో, ఇన్నాళ్లాయె పొకపోయి. ఏవంటాడులే, రేపిత్తానంటే సరి. ఇయ్యాలమాత్రం ఏందో తేల్సుకోవాలి." కామయ్య కోపం పెరిగింది. మసకమసక సంజెలో, గొడ్లకు కుడితి తాగించి, గాళ్ళుకడుతా అనుకున్నాడు. ఇనుకోకుండ, అనుకోకుండ వచ్చిందీ మాట. లచ్చిని రంగయ్యకిస్తారని, లచ్చి అయ్యతోటి మున్సబు చెప్పిండనీ, మున్సబుగారి పాలేరు రాఘవులు వచ్చి చెబితేగా తనకు తెల్సింది. ఎంత పనిచేసిండు వీడి తల్లి సిగదరగ. పెద్దమనిషి సేష్టాలేనా ఇవి? పాపం తగులుద్ది, పెద్దోళ్ళను తిడితే అని ఊరుకుంటుంటే, మరీమరీ రెచ్చిపోతుండు.

దానిల్లు గుల్లయితే ఆమాత్రంగానెం లచ్చి వుండొద్దూ! బావే! తనకోసం యింత కట్టపడుతుండడే అనుండొద్దూ! అయ్యాల ఊళ్ళో పెద్దమ్మోరు వుండి రోజుకిద్దరు చత్తుంటే ఐదుమైళ్ళ దూరానవున్న పిడ్రాళ్ళకెళ్లి మందు పొడిపిచ్చకొస్తినే. దారిలో ఏమైంది! పెద్ద మఱ్ఱిచెట్టుకాడ, మసగమసగ ఎన్నెట్లో కూలబడ్డది లచ్చి, నేనడవలేనని. చేతులు నొప్పెడుతున్నాయట. ఇంతింత లోతుకు పొడిచొదిలి పెట్టిండు టీకాలట. వాడు ముదనష్టమార. ఊళ్ళో అంతోటు జబ్బులుండె. లచ్చి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. చేతులు నొప్పులు పుడుతున్నాయంట. కూసింత కూకొనిపోదామంది. ఎంతకూకున్నా లేవ లేక పాయె. ఉసూరుమంటుండె. కొసెడుదూరం నడవాలిమరి. ఎంతసేపు కూకునేట్టు. పసిదాన్ని ఎత్తుకున్నట్టు చంకలో యిరికిచ్చుకున్నాడు తాను. చకచకా సాగిపోయిండు. అంతోటు బాధలో గలగలమని నవ్వింది లచ్చి. తన పానం హాయిమంది. సిలకలా ముడుచుకుంది. గూటిలో పావురాయిలా వొదుకుకుంది. అంతోటు సిగ్గు. పదేళ్ళపిల్ల ఏం నడుత్తది. అందులో ఏడుమైళ్ళు నడచిందప్పటికే. పైన పోటుబాధ జాస్తిగావుండె.

ఊరిబయట చంకనుండి దించితే, సిగ్గుపడుతూ, చెబుతవా? అంది. చెప్పనులేవే నాసిలకా! బుగ్గమీద సిటికేసిండు తాను. మసక ఎన్నెట్లో తలుక్కున నవ్వింది. తనకప్పుడు ఇరవైఏళ్లు లచ్చికి పదేళ్ళు.

లచ్చికిప్పుడు పదేనేళ్ళు. తనకు పాతిక. తాను సెడ్డవాడట. మున్సబ్బుసెల్లెలు కొడుకు రంగయ్య మంచోడట. లచ్చినాడికియ్యమని మున్సబు సెబితే, వెంకయ్యమామ సైఅన్నాట్ట. ఈడిల్లు తగలబడ! ఈపెళ్లి చెయ్యనీ, కరణంగారి తోటలో ఎలగచెట్టుకు, వురిదీస్తా మామని! మామైతే అయిండు ఇంతపనిసేత్తునప్పుడు పానంపుచ్చుకున్నా పాపంలేదు.

ఇంతకూ ముందు మున్సబునసాలె. ఎంకయ్యమామదేముంది, ఎట్టసెబితే అట్టయిండట. ముందసలు మున్సబుసంగతి తేల్సుకోవాలి. రేపు మిరపతోట పీకిత్తడంట. ఇయ్యాల అక్కడనే పండుతాడు. బుడేసాయిబుదగ్గర మంచిట్రాంగ్ది మూడుబుడ్లుచ్చుకుంటే సాలు. చుక్కపోయే యేలకి మున్సబు అంతు తేల్సుకోవాలి.

తాను కరణంగారిదగ్గర కమతం చేస్తుండానని మున్సబుకు కోపమేమో? అయినా కరణానికి మున్సబుకీ, అంత యిరోధాలులేవుగా. ఇద్దరూ మంచోళ్ళే యిదివరకు. ఇప్పుడు పుట్టింది మున్సబుకు. కరణంగారెంత మంచోడు, మొన్న శివరాత్రికి కొండకాడ కెళతనంటే రెండురూపాలిచ్చిండు. గుడ్డలిచ్చిండు. కరణంగారు దర్మపెబువులు. అయ్య.

జచ్చి, అమ్మసచ్చి, నా అన్నవాళ్లులేక సత్తుంటే, మామ, తాను తాగి తందనా లాడతనని ఇంటి గడపకే రానియకపోతే, ఊళ్లో ఎవరూ పనియ్యకపోతే, కరణంగారు కమతానికి కుదుర్చుకొన్నారు. ఎంకయ్య మామ పోయి చెప్పిండట. "వాడు నాకైన వాడేమరి. పనీపాట బాగనే సేత్తడు. గుణం మంచిదిగాదు." కరణంగారన్నారు: "కాకపోతే మాన్లే. వాడెట్టా బతుకుతాడుపాపం" కరణంగారు ధర్మప్రభువులు. కరణంగారికి తను తాగుతడనేయిషయం తెలియకుండ వుండాలని ఎంత పెయత్నం సేసిండు తాను! బుడేసాయిబు కొట్టుకాడ తాగి కొట్టంలో నిదురబోతుంటే, పెద్ద ఎద్దుకు మేత ఏయటానికివచ్చి కరణంగారు సూశారు. అంతే సెప్పుదీసుకొని రెండు కొట్టిండు. కొడితె మానె. తన సెర్మం వొలిసినా, ఋణం తీరదు. తాను మానుకోలేక పోయిండు. బుడే సాయిబు కనబడితే వొదిలిపెట్టడు. మూడు బుడ్లన్నా కొట్టాల్సిందే. కరణంగా రేమనంలేదు. తరవాత "వాడిగుణమంత ఏంచేస్తాం"? అన్నారు ఎవరితోనో. మా రాజు చల్లగుండాలి, కొడుకులు కోమాళ్ళతో. పెద్దల్లుడు తాసిల్దారంట. మున్స బల్లుడు సచ్చాడు దుక్కిదున్నుకుంటూ. వాడిల్లు దుంపనాశనంగాను, వాడింటిముందు పాడెలెగవ. తాను మంచోడుగాదు. తననోటినిండ సెడ్డతిట్లోస్తయిమరి! ఇంతకూ లచ్చినసాలి. ఇంతఏడుపు తన కోసమేడుస్తుండడుగదా, బావను తప్పసేసికోను అని సెపితే ఏంపోతది? మామ వొప్పుకోడా. క్షణంలో వొప్పుకొంటాడు. లచ్చి అంటే పంచప్రాణాలు ఆయనకు. లచ్చి సామాన్యమైందా. అసలు బొమ్మలింటే పుట్టాల్సింది. అచ్చం దబ్బపండు రంగు చాయ. తాచుపాములాగ నల్లగా బారెడు పొడుగు జడ. కొండకాడనుండి కుప్పెలు తెచ్చి యిస్తే ముసిముసినవ్వులు నవ్వుతూ తీసుకుంది. ఏనాటికైనా లచ్చి తనలచ్చే అనుకున్నాడు తాను. లచ్చిలాంటిపిల్ల అసలులేదు. గొప్పగొప్పవాళ్ళే లచ్చినిచూస్తే ఇదయిపోతారు. వేసవికాలపు శలవలకు కరణంగారి రెండో అల్లుడు వచ్చాడు. ఆయనేందో పట్నంలో పెద్దచదువు చదువుతున్నాడంట. ఓ రోజు తానక్కడుండగనే లచ్చివచ్చింది. కరణంగారి రెండో అల్లుడు అమ్మాయిగార్ని అడిగారు ఈ అమ్మాయి ఎవరని. మనకామిగాడి భార్య అని అమ్మాయిగారు చెబుతుంటే, తన గుండెలు ఉప్పొంగిపోయినాయి. 'కామయ్య చాలా అదృష్టవంతుడు' అన్నారాయన. లచ్చి చాలా సిగ్గుపడి పోయింది. "భలేదాన్ని పెళ్ళాడావోయ్" అన్నారు అల్లుడుగారు. "పెళ్ళి రేపు మాఘమాసంలోనండీ" అంది అమ్మాయిగారు. "అయితే భలే, కామయ్యా, పెళ్ళికి పప్పన్నం వుందన్నమాట. ఇసింత కార్డుముక్క రాస్తే నేనొత్తాగా" అన్నారు గమ్మత్తుగా ఆయన. లచ్చి వెళ్ళి పోయింది అక్కడ నిలబడకుండా.

"ఏం ఎగతాళి చేస్తారయ్యా" అన్నాడు తాను.

"ఎగతాళి కాదోయ్. మరినువ్వు కార్డురాయి. నేనురాకపోతే నువ్వడుగుదువు గాని."

తనకు భలే హాయనిపించింది. ఆయనగారికి దండం పెట్టాలనిపించింది. అమ్మగారూ - అయ్యగారూ, భలేజోడు. చిలకా గోరింకలు, ఎంత మమకారం? అయ్యగారు వారానికి వుత్తరమెయ్యంది ఉండలేరు. అమ్మగారుకూడ అంతే.

అటువంటి తనలచ్చి యివాళ మున్సబువచ్చి రంగయ్యను చేసుకోమంటే వొప్పుకుందా? రాఘవులు వొప్పుకుందనేగా సెప్పింది. రాఘవులు అబద్ధాలెందుకు సెపుతాడు. లచ్చి వొప్పుకుందామో మరి! మనుషులు ఎంత తొందరగా మనసులు మార్చుకుంటారో, లచ్చిని చూస్తే తెలుస్తున్నది తనకు.

తనకు వొంకేమిటి. లచ్చికోసం ఏం చెయ్యమన్నా చేత్తాడు కావాలంటే. రంగయ్యకంటే తాను తీసిపోయాడా. మున్సబుగారింటికొస్తే రంగయ్యను తాను చూశాడు. ఒక్కపలుచగా పీనుగులాగా ఎదవ. తనకు తక్కువైందేంది. వాడికి ఎక్కువగా వున్నదేంది. రెండెకరాల పొలముందట. తనకు కరణంగారిచ్చిన స్తలంలో గుడిశెవుంది. అయినా పోయి లచ్చిని కనుక్కుంటే సరిపోతుంది. లచ్చికోసం తాను బతుకుతున్నాడు. లచ్చి ఏంచెప్పినా తాను చేశాడు. లచ్చిమాట తాను ఎప్పుడూ కాదనలేదు.

కొర్లపున్నమినాడు, లచ్చి గుడిశెకాడికొచ్చి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. కావిలించుకొని కళ్ళనీళ్ళు

తుడిచి "ఎందుకే?" అన్నాడు తాను. "తాగుతావా? ఇంక తాగబోకుబావా? అయ్య రాత్రల్లా నిన్ను తిట్టిపోశాడు. తాగితే నిన్ను చేసుకోను, ఒళ్ళు గుల్ల చేసుకుంటావా? ఇంక తాగావా నీతో పలకను."అంది లచ్చి. "ఇంకతాగనే. తాగితే నే సచ్చినంత ఒట్టు. ఇక తాగితేసూడు. వాత బెట్టు." అన్నాడు తాను. లచ్చి సంతోషంతో ముద్దుబెట్టిపోయింది. అప్పటినుంచి ఇప్పటిదాకా, మూణ్ణెల్లయింది తాను బుడ్డివాసన చూచి. బుడే ఎన్నిమాట్లు రమ్మన్నా తాను పోయినాడా? తన లచ్చి ఏంచెప్పినా వింటాడుతాను. ఇయ్యాళ మళ్ళీ తాగుదామనుకుంటున్నాడు. లచ్చి తనది కాకపోయిన తర్వాత, తాను ఎట్లాపోతే ఎవరికెందుకు? ఇయ్యాళ మూడుబుడ్లుకొట్టి మున్సబును సఫాచేయాల్సిందే.

కామయ్య బువ్వతాగకుండానే, కాసంతసేపు పండుకున్నాడు. తరువాతలేచి, చింతతోపులో నీలిమందు బట్టీలదగ్గరికొచ్చాడు. బుడేసాయిబు లేడు. కామయ్యకు భలే కోపమొచ్చింది. ఏడ చచ్చాడు దొంగముండకొడుకు? ఇయ్యాళ్నే చచ్చుంటాడు. పక్కనున్న ఏనాదిగుడిశెలోని ఏనాద్దాన్ని పిలిచి అడిగాడు. మధ్యాహ్నంవేళ పోలీసులొచ్చి పట్టుకపోయినారట చడీచప్పుడు కాకుండా. కామయ్య నిరుత్సాహ పడిపోయాడు. మళ్ళీ ఇంతలోకే అనుకున్నాడు. "మున్సబుకు తరిగెయ్యాలంటే, కైపుగూడ అవసరమా? కైపెందుకు, ముసిలి ముండాకొడుకు, నాలుగుతన్నులు తంతే చచ్చూరుకుంటాడు." కామయ్య కాలవదాటి మిరపతోటవైపు నడవటం మొదలెట్టాడు. మండిపోతున్నాడు. పెళ్ళిమాటలు గూడా ముగిసినట్టేనట. అంతా సిద్ధమైందట. రాఘవులు చెప్పాడు. కామయ్య మండిపోయినాడు. మసగ్గా ఎన్నెల ఎలుగుతున్నది. నడుమ నడుమ ముద్దలుముద్దలుగా బంతిపూలు, గుబురుగుబురుగా పెరిగివున్న బంతిచెట్లకు పూచివున్నవి. మిరపతోటంతా ఎర్రగా పండివుంది. ఆకులకంటే కాయలే ఎక్కువ అగపడుతున్నవి. కామయ్య చిన్నగా నడిచాడు.

గూటికాడ మంచంమీద మున్సబు కూకోని వున్నాడు. ఇంకానిద్రపోవటంలేదుముండాకొడుకు. కొరివిదయ్యమాలె కూచోని చుట్టకాలుస్తున్నాడు.

ఓహ్, ఎవరది? కేకేశాడు మున్సబు. కామయ్య పలక్కుండా నడచివెళ్ళాడు. కామయ్యకు భయం పుట్టింది. మున్సబు కేకలేస్తే, కేకలేసినా ఎవరికీ వినపడదులెమ్మనుకున్నాడు మళ్ళా. చుట్టుపక్కల పొలాల్లో ఎవరేనా వుండి వస్తే, అనుకున్నాడు మళ్ళీ. ఎందుకుండరు? తప్పకుండా వుంటారు. పొలాలకు కాపుగానేవాళ్ళు వుంటారు. కామయ్యకు కాళ్ళు తడబడ్డాయ్, భయం భయం పుట్టింది.

"ఓహ్, నీవటరా కామయ్యా! మీయిద్దరికీఓకేసారి పుట్టిందే! లచ్చి ఇంతకుముందే వచ్చిపోయింది. అదే కూకోని ఆలోచిస్తున్నా. అది చెప్పిపోయినపట్నుంచీ నిద్రపట్టటంలేదు. కామయ్యనే పెళ్లికొడుకును చేద్దామనుకున్నాను. లచ్చి ఏడ్చిపోయింది నా కడుపు తరుక్కుపోయింది. లచ్చం, నా చిన్నపిల్ల బతికివుంటే లచ్చిలాగా, అంత అయ్యేది. అవేకళ్లు, అవేముక్కు," కామయ్య అక్కడ కూలబడిపోయ్యాడు. మున్సబు చెబుతున్నాడు. "నువుతాగుబోతువని, పాడుముండాకొడుకువని, లచ్చిని నా కూతురిలా చూసుకుంటున్నాను కాబట్టి నీ కియ్యటానికి వొప్పుకోలేదు, కాని లచ్చివచ్చి ఏడుస్తూ, అంతా చెప్పిపోయింది. మంచివాడివైనావట. నా కల్లుడవవుతున్నావు. లచ్చి అంటే నా కంత మమకారం. కామయ్యా కళ్ళకద్దుకొని కాపాడుకో, లచ్చిలాంటిపిల్ల జనమ జనమాలకూ తపస్సుచేసినా నీకు దొరకదు. లచ్చికి నీమీద ఇంత మనసుందని తెలీదు. ఎంతగా అల్లాడిపోయిందో, యీ నాలుగు రోజులనుంచీ బిడ్డ."

"గోవులాంటి మారాజుని తిట్టుకున్నాను నా నాలిక కాల" కామయ్య కళ్ళవెంబడి నీళ్లుతిరిగినయ్, మున్సబు రెండుకాళ్ళూ ముందుకొంగి పట్టుకున్నాడు.

"కొండకాడచేయిస్తా కామయ్యా పెళ్ళి. నా పిల్లకు జబ్బుచేస్తే, మొక్కుకున్నాను. కాని బతకలేదు. లచ్చే నా పిల్ల అనుకుంటాను."

కళ్ళనీళ్లు కనబడకుండా కామయ్య వెనక్కు తిరిగి, మనసులో మున్సబుకు వేయిమొక్కులు మొక్కుకుంటూ, మసకమసక వెన్నెట్లో గుడిశెవైపు సాగిపోయ్యాడు.

★